# చర్విత చర్వణం

కథ

నరేష్ నున్నా

చీకటి నా సఖి.

నిశి నాకు నేస్తం.

ఈ గది ఓ పంజరం.

రెండు క్షణాల ఆవేశాన్ని చల్లార్చుకునే విటుల మృగతృష్ణను, కళ్ళేగ్రచేసి, నిస్సహాయంగా చూసే ఈ బెడ్‌లైట్ నాతోడు రాత్రంతా.

నైట్ డ్యూటీస్ కారణంగా వాలిపోయే కళ్ళు, సోలిపోయే ఒళ్ళు నిద్రపొమ్మని గోల చేస్తుంటే, 'కస్టమర్ల' రద్దీ వలన మార్నింగ్ షిఫ్ట్ కూడా తప్పని సరౌతున్న నా పరిస్థితికి జాలిపడి, ఇంటి కప్పు నుండి లోనికొచ్చి సానుభూతినందిస్తూ, నాకు చిరు వెలుగురేఖల్ని చూపించే సూర్యుడు నా శ్రేయోభిలాషి.

ఈ పంజరంలోకి నేనొచ్చి, కాదు తీసుకురాబడి నాలుగు సంవత్సరాలు.

'నీరు లేనిదే బ్రతకలేనన్న నా మాజీ ప్రేమికుడి బ్రతుకుతెరువు నాలాంటి వారిని ఈ పంజరాలకు అమ్మడంతో ముడిబడి ఉందని, అతనితో లేచిపోయి వచ్చినాక తెల్సింది కాస్త ఆలస్యంగా.

ఊహల్లో, నా ప్రియుడితోనే నిర్మించుకున్న రంగుల హర్మ్యాలు, గాలిమేడల్లా కూలిపోవడం ఏమాత్రం అనుభవం లేని ఈ కొత్త 'ఉద్యోగం' నేను మొదట్లో ఎదురు తిరిగేలా చేసాయి. ఈ పంజరం నుండి పారిపొమ్మని ప్రోత్సహించాయి.

పర్యవసానంగా చర్మాన్ని చీల్చే బెల్ట్ దెబ్బల్ని, ఒంటిని కాల్చే అట్లకాడ వాతలు, పస్తులున్న నా శరీరాన్ని, నా ప్రతిఘటననీ బాగా బలహీన పరిచాయి.

మా చీకటి కొట్టాల ఓనర్ శాంతమ్మ. పేరులోనే శాంతం చాలా 'అనుభవం'. ఎంతో పలుకుబడి ఉన్నాయామెకు.

ఎంత పలుకుబడి లేకుంటే, ఈ అంగడిని స్త్రీ సంక్షేమ శాఖామాత్యులచేత ప్రారంభం చేయిందీ! ఓ పెద్ద 'ఖాకీ'ని ముఖ్య 'అతిథి'గా ఆహ్వానిస్తుంది?! ఏమాట కామాటే చెప్పుకోవాలి. శాంతమ్మది బహు జాలి మనస్సు. ఒంటిమీద గాయాలు త్వరగా మాడిపోయేందుకు, వాటికి కారం అద్దించేంత జాలి మనసు. అంత 'జాలి'ని భరించలేక ఇలా అలవాటు పడిపోయాను.

★ ★ ★ ★ ★

కైపునిషాని ఒలికే గాజుకళ్ళు...

పౌడర్‌తో పాటు ముఖానికి పులుముకున్న నవ్వు...

నా జీవితవరణంలోకి ఆనందం ప్రవేశాన్ని నిషేదించే రెడ్ సిగ్నల్‌లా లిప్‌స్టిక్ పెదాలు.

ఆడమ్, ఈవ్‌ల ఆదిమదశకు అంగుళాల



నారగా నన్నుంచే ఊపిరి అచ్ఛాదన చీర.

రాత్రంతా మురిపించి, తెల్లారికి కళా విహీన మయ్యే మా బ్రతుకుల్లాంటి కొప్పుల్లో మల్లెలు...

...నా అలంకారాలు...

ఓ రోజు మా అంగడికొచ్చిందో 'అభ్యుదయం'.

'మగాడి కాంక్షాగ్నితో ప్రజ్వరిల్లే ఈ దేహనాటికల్లో, ఆడదాని ఆనందానుభూతులు, వ్యక్తిత్వాలు సమూలాచ్ఛేదనకు గురౌతున్న ఈ వధ్యశిలల్లో, ప్రభాత బాహోదయం లేదా?' అని ఆవేశంగా ప్రశ్నించింది.

సమస్య పరిష్కారానికి తన వంతు పాటున ద్రావని ఆదర్శాలు వల్లించింది. ఆ అభ్యుదయాన్ని అభినందించారు స్త్రీ సంక్షేమ మంత్రివర్యులు.

ఫలితంగా ఆ చీకటి గహ్వరం నుండి నాకు విముక్తి.

పచ్చనోట్ల కట్ట మా శాంతమ్మకు ఆనందాన్ని తెచ్చి పెడ్తే, నేననుభవించబోయే 'స్వేచ్ఛ' నాకు సంతోషాన్ని కలిగించింది.

గత నాలుగు సంవత్సరాలలో నేను 'వెలుగు' చూసింది ఒక్కసారే. అదీ సదరు మంత్రిగారి పుణ్యానే. కదలని మొరాయిస్తున్న ఓ ఫైల్ కదలిక కోసం. మంత్రిగారికి నైవేద్యంలా నేనాయన గెస్ట్ హౌస్‌కు వచ్చినప్పుడొక్కసారి...మళ్ళీ అదే మంత్రిగారి ప్రోద్బలం, అండ, అభ్యుదయంతో నా మెడలో తాళి కట్టించి, నా జీవితానికి మళ్ళీ 'వెలుగు' చూపించాయి.

కానీ తాళికట్టిన వేళ్ళే, నా చేతికి కాగితాల్ని, పెన్ను అందిస్తూ, 'ఈ కంట్రాక్ట్ పైన ఆఫీసర్ గారి సంతకం సాధించావంటే, మన యోగం మారినట్టే...' అని నన్నే గదిలోకి తోస్తుంటే..., 'చిలుకాదని' ఎదురు తిరిగే శరీరం పైన ఎర్రని సిగరెట్ ముద్రలు వేస్తుంటే, కొన ఊపిరితో కొట్టుకులాడుతున్న నా మనసు నిర్జీవమైపోయింది.

★ ★ ★ ★ ★

రంగం మారింది... నా పాత్ర కాదు.

పంజరం మారింది... 'వేశ్య' అన్న ముద్ర మాత్రం కానేకాదు.

కొత్తసీసా... కానీ పాత సారానే...

---

(మినీకథ)

# దాసోహం

ప్రముఖ సినీతార 'సుధశ్రీ' ఇంటి ముందు ఆగింది బడా నిర్మాత 'పాపారాయుడి' కారు. తను కొత్తగా నిర్మించబోయే ఓ మసాలా చిత్రంలో ఆమెని హీరోయిన్‌గా బుక్ చెయ్యాలని వచ్చాడతను. కానీ... సుధశ్రీ ప్రతి నిర్మాతకీ ఏవేవో షరతులు పెడుతోందని విన్నాడు. ఆ విషయం స్వయంగా తెలుసుకుందామని కూడా వచ్చాడు. పాపారాయుడిని చూసి సాదరంగా లోపలికి ఆహ్వానించింది సుధశ్రీ తల్లి.

సుధశ్రీ పాపారాయుడికి మధ్య సంభాషణ మొదలయింది.

"మీరు నేను నిర్మించబోయే కొత్త చిత్రంలో నటించాలి. డేట్స్ కోసం వచ్చాను"

"తప్పకుండా ఇస్తాను... ఇంతకీ రెమ్యూనరేషన్ ఎంత?" యథాలాపంగా అడిగింది సుధశ్రీ.

"పాతికవేలు..."

"ముందే చెప్తున్నాను. అర్ధనగ్న దృశ్యాల్లో నటించను. బాత్రూం, బెడ్‌రూం సన్నివేశాల్లో నటించను. ఒంటి నిండుగా ఉండే బట్టలే ధరిస్తాను" నిర్మాత మాటలు పూర్తి కాకుండానే మొదటి షరతు విధించింది. అంగీకారంగా తలూపాడు నిర్మాత.

"ఒక్క విషయం..." అర్ధోక్తిలో ఆగి ఆమె వైపు చూశాడు.

"ఏమిటన్నట్టు" చూసింది.

"మీరు మాట్లాడేటప్పుడు మీ కళ్ళు ఎంత అందంగా కదులుతున్నాయో! మీ కళ్ళకివ్వచ్చు మరో ఐదువేలు..."

"ముందే చెప్పడం మరిచాను... వర్షం సీన్స్ లాంటి వుంటే చేస్తాను. అదీ చీరలోనే సుమా!" మొదటి షరతుని కాస్త సడలించింది.

"మీ పెదవులెంత అందంగా ఉన్నాయో! ఆ పెదవులకివ్వచ్చు... పదివేలు"

అగస్త్యపు గడహేమంత

"జాకెట్, లంగాలో నటించే సన్నివేశాలున్నా ఫర్వాలేదు. స్లీవ్‌లెస్ జాకెట్లూ, ట్రాన్స్‌పెరెంట్ లంగాలూ తీసుకోను సుమా!"

"ఓహ్! మీ బుగ్గలు... ప్చ్... పదిహేనువేలు విలువ చేస్తాయి."

"లోనెక్ జాకెట్లూ, అప్‌స్కర్ట్‌లూ ఉన్నా ఫర్వాలేదు. "బొడ్డు" మాత్రం కనిపించకూడదు.

"మీ ముక్కు... ఆ ముక్కుకివ్వచ్చు... ముప్పైవేలు... ఏమందం... ఏం చందం..."

"సర్లెండి... మీరు మరీ మొహమాటం పెట్టేస్తున్నారు. బికినీలు ధరించడానికి ఒప్పుకుంటున్నాను"

"అసలు మీ నటనకివ్వచ్చు... లక్షన్నర"

"ఇక ఇవన్నీ ఎందుకులెండి. స్విమ్మింగ్ సూటయినా, లాగించేద్దాం."

"అసలు మీ నటనకి రేటు కట్టడానికి మేమెంత వాళ్ళం చెప్పండి? మీకెంత కావాలో అడగండి. మీకాళ్ళ ముందు పెడతాం!"

"నగ్నంగా నటించడానికయినా నేను రెడీ! అందుకు తగ్గ ప్రతిఫలం ముట్టచెప్పించండి చాలు..."

బేరం కుదిరింది. డబ్బు ముందు నీతి నియమాలు బలాదూర్!

డబ్బుకి లోకం దాసోహం!

---

## ముకుల్, అమితాబ్ విడిపోయారా?



దర్శకుడు ముకుల్ ఎస్. ఆనంద్ తీసిన చిత్రాలన్నీ ఇంతవరకు అమితాబ్ బచ్చన్‌వే! అగ్నిపథ్ , హమ్, ఖుదాగవా చిత్రాలకు ముకులే దర్శకత్వం వహించాడు. ముకుల్ అమితాబ్ ఫ్యామిలీ ఫ్రెండ్ కూడా. అయితే ఈ మధ్యకాలంలో ముకుల్ ఆనంద్ అనిల్ కపూర్‌తో ఈ మధ్య ఒక చిత్రాన్ని చేయడం ప్రారంభించాడు. తనకు ప్రత్యర్థులుగా భావించే కపూర్ సోదరులతో కలిసినకారణంగా ముకుల్ పై అమితాబ్‌కు కోపం వచ్చింది. దాంతో ఇద్దరూ విడిపోయారు.